అభిమానులకు విందుభోజనమేనట?

అగ్ర హీరో చిరంజీవితో సినిమా చేసే అవకాశం వస్తే.. వింటేజ్ లుక్ అంటూ తెగ ఆరాటపడిపోతుంటారు నేటి యువ దర్శకులు. అయితే.. నిజానికి ఆనాటి చిరంజీవిని ఏడు పదుల ఈ వయసులో ఆవిష్కరించడం సాధ్యమా? అసలు ఆ ఆలోచన కరెక్టేనా? చిరంజీవి సాటి హీరోలైన రజనీకాంత్, కమల్ హాసన్, మమ్ముట్టి, బాలకృష్ణ, మోహన్‌లాల్ లాంటివాళ్లు వయసుకు తగ్గ పాత్రలు చేస్తూ విజయాలను అందుకుంటున్న తరుణంలో ఇంకా వింటేజ్ లుక్ అంటూ పాకులాడటం యంగ్ డైరెక్టర్లకు కరెక్ట్ కాదేమో.. దర్శకుడు అనిల్ రావిపూడి చేయబోతున్న సినిమాలో కూడా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపిస్తారని, డ్యూయెట్లతో స్వెప్పులతో మోత పుట్టిస్తారని, సినిమాపేరు 'సంక్రాంతి అల్లుడు' అంటూ.. రకరకాల వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే వీటన్నింటికీ తను రాసుకున్న కథతో చెక్ పెట్టేశారట అనిల్ రావిపూడి. మెగాస్టార్ కోసం ఆయన రాసుకున్న కథకు సంబంధించిన అసలైన సమాచారం వెలుగు చూసింది. ఇందులో చిరంజీవికి డ్యూయెట్లే ఉండవట. లవ్ ట్రాక్ అసలే ఉండదట. పైగా కంప్లీట్ ఫ్యామిలీ మ్యాన్‌గా వయసుకు తగ్గ పాత్రలో కనిపిస్తారట. అలాగే.. కామెడీ విషయంలోనూ అనిల్ రాజీపడ లేదట. కామెడీ పండించడంలో మెగాస్టార్ మాస్టర్ అని అందరికీ తెలిసిందే. అందుకు తగ్గట్టే క్యారెక్టరైజేషన్ కూడా రాసుకున్నారట అనిల్. ఇక యాక్షన్ సీన్స్ అయితే ఓ రేంజ్‌లోనే ఉంటాయని తెలుస్తున్నది. రాయలసీమ నేపథ్యంలో కథంతా సాగుతుందనీ, అందుకే చిరంజీవి కూడా చిత్తూరు యాసను ప్రాక్టీస్ చేసే పనిలో ఉన్నారనీ సమాచారం. మొత్తంగా పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమే వీర్దిదరి కాంబినేషన్‌లో రానున్నదని తెలుస్తున్నది.

మల్టీస్టారర్‌కు అసలైన నిర్వచనం

మణిరత్నం దర్శకత్వంలో తాను నటిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమా గురించి అగ్ర నటుడు కమల్‌హాసన్ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. 'నాయగన్' వంటి కల్ట్‌క్లాసిక్ చిత్రాన్ని అందించిన ఈ ద్వయం 37 ఏండ్ల విరామం తర్వాత 'థగ్‌లైఫ్'తో ప్రేక్షకుల ముందుకురాబోతుండటం విశేషం. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు కమల్‌హాసన్. ఈ చిత్రం ద్వారా మణి రత్నం మల్టీస్టారర్‌కు అసలైన నిర్వచనాన్ని అందించబోతున్నారని చెప్పారు. దక్షిణ, ఉత్తర భారతానికి చెందిన ప్రతిభావంతులైన నటీనటుల కలయికలో అద్భుతమైన కంటెంట్‌తో ఈ సినిమా రూపొందుతున్నదని తెలిపారు. ''థగ్‌లైఫ్' నిస్సందేహంగా గ్రేట్ మల్టీస్టారర్ అవుతుంది. ఇందులో నటించేవారు తిరుగులేని స్టార్‌డమ్‌ను సంపాదించుకుంటారు. ఎందరో యువనటులు ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది. సినిమాలోని ప్రతీ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులు ఓ గొప్ప చిత్రాన్ని చూడబోతున్నారు' అని కమల్‌హాసన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమాలో శింబు, త్రిష, నాజర్, జోజూజార్జ్, అశోక్ సెల్వన్, ఐశ్వర్యలక్ష్మి తదితరులు నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది.

కల నిజమాయెగా.. కోరిక తీరేగా..

ప్రస్తుతం బాలీవుడ్‌లో రష్మిక ప్రభ ఓ స్థాయిలో వెలిగిపోతున్నది. 'యానిమల్'తో యువతరానికి కలల రాణిగా మారిన రష్మిక.. ఆలిండియా రికార్డులు కొల్లగొట్టిన 'పుష్ప2'తో స్టార్ హీరోయిన్‌గా అవరించింది. ఇక 'ఛావా'తో నటిగా కూడా కితాబులందుకుంది. త్వరలో బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌తో కలిసి 'సికిందర్'తో రానుంది. ఈ సినిమా కూడా హిట్ అయితే.. ఇక రష్మికను బాలీవుడ్‌లో ఆపటం కష్టమే. ఇటీవల 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్‌తో తన అనుభవాలను మీడియాతో పంచుకున్నది రష్మిక. 'నేను చిన్నప్పట్నుంచీ సల్మాన్ ఖాన్ అభిమానిని. ఆయనతో నటించాలనేది నా కల. ఆ కల ఇంత త్వరగా నెరవేరుతుందని అనుకోలేదు. లొకేషన్‌లో ఆయన నుంచి ఎన్నో నేర్చుకున్నా. ప్రతి విషయంలోనూ పూర్తి క్లారిటీతో ఉంటారాయన. ఎంత కష్టమైన యాక్షన్ సన్నివేశం చేసినా.. ఆయనలో ఫ్రెష్‌నెస్ మాత్రం తగ్గదు. ఎప్పుడూ ఫుల్ ఎనర్జీతో యాక్టీవ్‌గా కనిపిస్తారు. నా ఆరోగ్యం బాగుండకపోతే ఇంటి నుంచి భోజనం తెప్పించేవారు. ఆయన అంతపెద్ద సూపర్‌స్టార్ ఎందుకయ్యారో కలిసి పనిచేస్తుంటే తెలిసింది.' అన్నారు రష్మిక మందన్నా. ఇదిలావుంటే.. వీరి 'సికిందర్' సినిమా నుంచి మంగళవారం మేకర్స్ ఓ పాటను విడుదల చేశారు. 'నాచే..' అంటూ సాగే ఈ పాటలో సల్మాన్, రష్మిక జోడీ చూడముచ్చటగా ఉన్నదని అభిమానులు అంటున్నారట.

టైమ్ మిషిన్ మళ్లీ వస్తోంది

అగ్ర హీరో నందమూరి బాలకృష్ణ కెరీర్‌లో క్లాసిక్‌గా చెప్పుకునే సినిమా 'ఆదిత్య 369'. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో.. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో.. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి ప్రత్యేకంగా అభిమానులున్నారు. తెలుగు చలనచిత్ర చరిత్రలోనే ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ సినిమాను ఏప్రిల్ 11న మళ్లీ గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్. ఈ విషయాన్ని మంగళవారం ఓ ప్రకటన ద్వారా ఆయన తెలియజేశారు. '34ఏండ్ల క్రితం జూలై 18, 1991న విడుదలైన ఈ సినిమాకు ఇప్పటికీ ప్రేక్షకుల్లో క్రేజ్ తగ్గలేదు. మనదేశంలో వచ్చిన తొలి టైమ్ ట్రావెల్ ఫిక్షన్ మూవీ ఇది. ఈ క్లాసిక్ నిర్మాణానికి సహకరించిన ఎస్పీబాలుగారికి, బాలకృష్ణగారికీ, సింగీతంగారికీ ఎప్పటికీ రుణపడి ఉంటాను. పి.సి.శ్రీరామ్, వి.ఎస్.ఆర్.స్వామి, కబీర్‌లాల్.. ఈ ముగ్గురు దిగ్గజ డీవోపీలు ఈ సినిమాకు పనిచేశారు. కృష్ణకుమార్, కృష్ణదేవరాయలుగా ద్విపాత్రాభినయం చేసి నట విశ్వరూపం చూపించారు బాలయ్య. సింగీతం దర్శకత్వ ప్రతిభ, ఇళయరాజా సంగీతం, మోహిని, సిల్క్ స్మితల అందచందాలు, అమ్రీష్‌పురి అభినయం ఈ సినిమాను క్లాసిక్‌గా నిలబెట్టాయి. ఈ సినిమాను 4కె డిజిటల్ చేశాం. సౌండ్‌ని కూడా 5.1 క్వాలిటీకి కన్వర్ట్ చేశాం. ప్రసాద్ టిజిటల్ టీమ్ ఆరు నెలలు శ్రమించి చక్కని అవుట్‌పుట్ ఇచ్చారు. రీ రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న నేటి తరుణంలో తప్పకుండా ఈ తరం ప్రేక్షకుల్ని కూడా ఈ సినిమా ఆకట్టుకుంటుందని మా నమ్మకం' అని తెలిపారు శివలెంక కృష్ణప్రసాద్.

మనందరం ఇంకా అదే పరుగులో ఉన్నాం!

'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో చెప్పిన విషయాలతో ప్రేక్షకులు ఇప్పటికీ బాగా కనెక్ట్ అవుతారు. ఎందుకంటే అప్పటికి ఇప్పటికీ ప్రపంచం ఏమీ మారలేదు. మనం ఇంకా అదే లక్ష్యాల వైపు పరుగెడుతున్నాం. ఓరకంగా ఈ సబ్జెక్ట్‌కు ఇప్పుడు ఇంకా ప్రాధాన్యత పెరిగిందనుకుంటున్నా' అన్నారు నాగ్‌అశ్విన్. ఆయన దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రం 'ఎవడే సుబ్రహ్మణ్యం'. నాని, విజయ్ దేవరకొండ, మాళవిక నాయర్, రీతూవర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. స్వప్న సినిమా పతాకంపై స్వప్నదత్, ప్రియాంకదత్ నిర్మించారు. ఈ సినిమా విడుదలై పదేళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 21న రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు నాగ్‌అశ్విన్ మాట్లాడారు. ఈ తరం వాళ్లు కూడా ఈ సినిమా చూసి ఎంతోకొంత పాజిటివిటీని అలవర్చుకుంటారనే ఉద్దేశ్యంతో రీరిలీజ్ చేస్తున్నామని ఆయన చెప్పారు. 'కల్కి' సీక్వెల్ షూటింగ్ ఈ సంవత్సరాంతంలో మొదలవుతుందని, ప్రస్తుతం సన్నాహాలు చేసుకుంటున్నామని నాగ్‌అశ్విన్ తెలిపారు. నానితో సినిమా చేద్దామనుకుంటే వర్కవుట్ కాలేదని, భవిష్యత్తులో తప్పకుండా ఆయనతో సినిమా చేస్తానని నాగ్ అశ్విన్ తెలిపారు.

సుకుమార్ సినిమాలో విలన్‌గా?

బాలీవుడ్ బాద్షా షారుక్‌ఖాన్‌తో అగ్ర దర్శకుడు సుకుమార్ ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారని, ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయని గత కొద్ది నెలలుగా ముంబయి సినీ సర్కిల్స్‌లో గాసిప్స్ వినిపిస్తున్నాయి. షారుక్‌ను నెగెటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో ప్రజెంట్ చేస్తూ సుకుమార్ ఓ స్క్రిప్ట్ చేశారని, రూరల్ పొలిటికల్ కథాంశంతో కూడిన ఈ సినిమాలో షారుక్ ఖాన్ పాత్ర రా అండ్ రస్టిక్‌గా సాగుతుందని, ఇందులో సామాజిక అంతరాలను కూడా చర్చించారని ఆ గాసిప్స్ సారాంశం. అయితే ఇందులో నిజానిజాలు ఎలా ఉన్నా..ఈ సూపర్ కాంబో సాకారమైతే చూడాలని అభిమానులు మాత్రం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. బాలీవుడ్‌లో ఎదురులేని హీరోగా ఉన్నారు షారుక్‌ఖాన్, ఇక 'పుష్ప-2'తో భారతీయ సినిమాలో కొత్త చరిత్ర సృష్టించారు సుకుమార్. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్ అంటే ఇక అభిమానులకు పండగే. బాక్సాఫీస్‌కు కాసుల వర్షమే అంటున్నారు. అయితే ప్రస్తుతం సుకుమార్, షారుక్‌ఖాన్‌లకు ఉన్న సినిమా కమిట్‌మెంట్స్ దృష్ట్యా మరో రెండుమూడేళ్ల తర్వాత వారి కాంబినేషన్‌లో సినిమా కార్యరూపం దాల్చే అవకాశముందని అంటున్నారు.

ఏసుకోండ్రా మీమ్స్.. చేసుకోండ్రా రీల్స్..

బ్లాక్ బస్టర్ 'మ్యాడ్'కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' సినిమా వస్తున్నది అనగానే సినిమాపై అంచనాలు ఆకాశంలో కూర్చున్నాయి. దీనికి తగ్గట్టే ఇటీవలే విడుదలైన టీజర్ కూడా విశేషంగా ఆకట్టుకున్నది. ఈ టీజర్‌లో సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. అలాగే.. ఇప్పటికే విడుదలైన లడ్డు గానీ పెళ్లి, స్వాతిరెడ్డి పాటలు కూడా జన బాహుళ్యంలో బాగా వినిపిస్తున్నాయి. తాజాగా మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'వచ్చారోయ్..' అంటూ సాగే ఈ పాటను కె.వి.అనుదీప్ రాయగా, భీమ్స్ స్వరపరిచి స్వయంగా ఆలపించారు. 'ఏసుకోండ్రా మీమ్స్.. చేసుకోండ్రా రీల్స్.. రాసుకోండ్రా హెడ్ లైన్స్.. ఇది మ్యాడ్ కాదు.. మ్యాడ్ మ్యాక్స్' వంటి పంక్తులతో అందరూ పాడుకునేలా ఈ పాట సాగింది. ప్రధాన పాత్రధారులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ త్రయం ఈ పాటలో ఓ రేంజ్‌లో అల్లరి చేశారు. ఆసక్తికరమైన కథనంతో కడుపు చెక్కలు చేసి హాస్య సన్నివేశాలతో ఈ సినిమా అలరిస్తుందని దర్శకుడు కల్యాణ్‌శంకర్ చెబుతున్నారు. ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్, కె.వి.అనుదీప్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో రెబా మోనికా జాన్ ప్రత్యేకగీతంలో సందడి చేశారు. ఈ నెల 28న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: శామ్‌దత్ ఐఎస్‌సీ, సమర్పణ: సూర్యదేవర నాగవంశీ, నిర్మాత: హారిక సూర్యదేవర, సాయిసౌజన్య, నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్ అండ్ ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్, శ్రీకరా స్టూడియోస్.

సుశాంత్ మిస్టరీ థ్రిల్లర్

సుశాంత్ కథానాయకుడిగా ఓ మిస్టరీ థ్రిల్లర్ రూపొందుతున్నది. ఇంకా పేరు నిర్ణయించని ఈ సినిమా ఆయన కెరీర్‌లో 10వ సినిమా కావడం విశేషం. పృథ్వీరాజ్ చిట్టేటి దర్శకత్వంలో వరుణ్‌కుమార్, రాజ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రెండు డిఫరెంట్ లుక్స్‌తో స్టైలిష్‌గా సుశాంత్ కనిపిస్తున్నారు. పోస్టర్ డిజైన్ చేసిన తీరును బట్టి ఇది మిస్టరీ థ్రిల్లర్ మూవీ అని తెలుస్తున్నది. భీతిగొలిపే కారుచీకటి, గుడ్లగూబలు, రాబందులు.. పుర్రెలు, వీటిమధ్య సీరియస్‌గా చూస్తూ సుశాంత్.. ఆయన్నే చూస్తూ ఓ నల్ల పిల్లి.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ చిత్రానికి మాటలు, స్క్రీన్‌ప్లే: అనిరుధ్ కృష్ణమూర్తి, కెమెరా: వైవిబీ శివసాగర్, నిర్మాణం: సంజీవని క్రియేషన్స్.

చేయనని చెప్పనుకానీ.. అలా అయితే చేస్తా..

'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే.. రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుంటున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలి నాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.

దరి దాటిన మోహం దేహమే కదా..

విజయ్‌కుమార్, శ్రావణి మజ్జరి, అరవింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రధారులుగా రూపొందిన పొయెటిక్ ప్రేమకథ 'కాలమేగా కరిగింది.'. శింగర మోహన్ దర్శకుడు. మరే శివశంకర్ నిర్మాత. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. 'దరి దాటిన మోహం దేహమే కదా.. ఎదుటే నిలిచేనూ.. ఆ యదపై తాకెను.. చెలి వీడినా మౌనం.. మర్మమే కదా.. కథలై కదిలెనూ.. ఆ కబురై పాకేనూ..' అంటూ సాగే ఈ పాటను దర్శకుడు శింగర మోహన్ రాయగా, గుడప్పన్ స్వరపరిచారు. సాయిమాధవ్, ఐశ్వర్య దదూరి ఆలపించారు. యువతరం మెచ్చే ప్రేమకథ ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: వినీత్ పబ్బతి, నిర్మాణం: సింగార క్రియేషన్స్ వర్క్స్.

రొమాంటిక్ థ్రిల్లర్ 'కిల్లర్ ఆర్టిస్ట్'

సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్ ఆర్టిస్టు'. రతన్‌రిషి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జేమ్స్ వాట్ కొమ్ము నిర్మిస్తున్నారు. ఈ నెల 21న విడుదల కానుంది. నైజాంలో మైత్రీమూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తున్నది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హత్య చేయడాన్ని ఓ కళగా భావించే వ్యక్తి కథ ఇదని, యథార్థ సంఘటనల ఆధారంగా ఈ కథ రాసుకున్నానని, రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించామని, ఈ సినిమాలో హత్యా ప్రవృత్తిని గ్లోరిఫై చేయలేదని దర్శకుడు తెలిపారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తీసిన రొమాంటిక్ థ్రిల్లర్ ఇదని నిర్మాత పేర్కొన్నారు. ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని హీరో సంతోష్ కల్వచెర్ల చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

ఈ కాన్సెప్ట్‌లోనే కొత్తదనం ఉంది

హర్ష రోషన్, కార్తికేయ, దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్యతారలుగా రూపొందిన చిత్రం 'టుక్ టుక్'. సి.సుప్రీత్‌కృష్ణ దర్శకుడు. రాహుల్‌రెడ్డి, లోక్కు శ్రీవరణ్, శ్రీరాములరెడ్డి నిర్మాతలు. ఈ నెల 21న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. 'ఓ వెహికల్‌లో ఓ సోల్.. ఆ వెహికల్‌కు ఓ బ్యాక్ స్టోరీ.. ఈ కాన్సెప్ట్‌లోనే ఓ కొత్తదనం ఉంది. తప్పకుండా అందరికీ నచ్చుతుందనుకుంటున్నా. ఈ కాన్సెప్ట్‌ని ఫ్రాంచైజీగా, యూనివర్సల్‌గా బిల్డ్ చేయాలనుంది.' అని దర్శకుడు సుప్రీత్‌కృష్ణ అన్నారు. ఫాంటసీ థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుందని నిర్మాత రాహుల్‌రెడ్డి తెలిపారు. ఇంకా ప్రధాన పాత్రధారులు నిహాల్ కోదాటి, శాన్వీ మేఘన కూడా మాట్లాడారు.